క్లుప్తంగా

సాగునీటి కాల్వ పరిశీలన

దేవరుప్పుల: నవాబుపేట రిజర్వాయర్ నుంచి సింగరాజుపల్లి, ధర్మావత్‌తండా, సీతారాంపురం ఏరియాకు సాగునీటి విడుదల కోసం సంబంధిత కాల్వలను ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సీజన్‌లో చివరి పంట సాగుకు ఇబ్బందులు చోటుచేసుకోకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

చర్య తీసుకోవాలి

తరిగొప్పుల: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఆశించి భంగపడడంతోనే కావాలని కొందరు జిల్లా నాయకులు.. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని వారిపై అధిష్టానం తగు చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి కోరారు. గ్రామ శాఖ అధ్యక్షుడు పండుగ కనుకయ్య అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనుకయ్య, పోషయ్య, యాకూబ్, లూకా, రాజు,తలకొక్కుల రవి, అర్జుల పోశిరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



జనగామ రూరల్: ప్రజా ఆరోగ్య విషయంలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంకిర్యాలకు చెందిన ఆదునూరి రాజేందర్ కుమార్తె దీపిక గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.1.50 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, ఎర్రమల్ల సుధాకర్, నర్సింగరావు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడిగా రవి



రఘునాథపల్లి: శ్రీ బీరప్ప ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పేర్నె రవి ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. జిల్లా కోఆపరేటివ్ సూపరింటెండెంట్, ఎన్నికల అధికారి వేణుగోపాల్ మంగళవారం మండల కేంద్రంలోని కురుమ సంఘం భవనంలో పెంపకందారులతో సమావేశమై ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా పేర్నె రవితో పాటు ఉపాధ్యక్షుడుగా బడితె శ్రీనివాస్, కార్యదర్శిగా మారాటి జంపయ్య, డైరెక్టర్లుగా ద్యావర రాజు, పేర్నె అనిల్, ప్రసాద్, రాజు, లెనిన్, వెంకటేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులకు ఎన్నికల అధికారి నియామక పత్రాలు అందజేశారు. పెంపకం దారుల సంఘం నాయకులు గుండా వెంకటయ్య, యాకయ్య, రాములు, నరసింహులు, కుమార్, నాగరాజు, అనిల్, వీరస్వామి, కుమారస్వామి పాల్గొన్నారు.

'విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం'

జఫర్‌గఢ్: ఇంటి మీటర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండలంలోని తిమ్మంపేటకు చెందిన అకోజు యశోద అన్నారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. ఇంటికి విద్యుత్ కనెక్షన్ కోసం ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇంటికి కరెంటు లేక రాత్రి వేళల్లో తాము అంధకారంలోనే ఉంటున్నట్లు తెలిపారు. కనెక్షన్ కోసం మీటర్ కూడా తీసుకోవడం జరిగిందన్నారు. తమ ఇంటి నుంచి విద్యుత్ లైన్ దూరంగా ఉండటంతో స్తంబాలు వేసి కనెక్షన్ ఇవ్వాలని సంబంధిత ఏఈ, లైన్‌మన్‌కు, ప్రజావాణిలో మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఏఈ విశ్వసాయితిని వివరణ కోరగా యశోద ఇంటి విద్యుత్ కనెక్షన్ విషయం ఇటీవలే తన దృష్టికి వచ్చిందని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి అప్రూవల్‌కోసం పంపించామని అనుమతులు వచ్చిన వెంటనే కనెక్షన్ ఇస్తామని తెలిపారు.

పత్తి పంట క్షేత్ర ప్రదర్శన



రఘునాథపల్లి: మండలంలోని శ్రీమన్నారాయణపురం శివారులో మంగళవారం పత్తి పంట క్షేత్ర ప్రదర్శన జరిగింది. ఐఏఎల్ ట్రాక్టర్ బ్రాండ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్షేత్ర ప్రదర్శనలో పలు గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో కంపెనీ మేనేజర్ భీష్మచారి, సేల్స్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రాక్టర్ బ్రాండ్ కంపెనీకి చెందిన సిన్వాహెర్కులెస్ వాడటం ద్వారా దిగుబడి పొందవచ్చన్నారు. పత్తి పంటలో అధిక దిగుబడికి అనుచరించాల్సిన విధానాలను వారు రైతులకు వివరించారు.

చెరువుల్లో వ్యర్థపదార్థాలు వేయొద్దు



దేవరుప్పుల: ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు



స్టేషన్‌ఘన్‌పూర్: చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

స్టేషన్‌ఘన్‌పూర్: చెరువులు, కుంటలలో వ్యర్థపదార్థాలను వేయడం ద్వారా నీరు కలుషితం అవుతుందని, వ్యర్థపదార్థాలను చెరువుల్లో వేయొద్దని ఛాగల్లు జెడ్పీఎస్ఎస్ ఎన్‌సీసీ అధికారి ఆర్.శాంతి అన్నారు. అంతర్జాతీయ నదుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఛాగల్లు జెడ్పీఎస్ఎస్ ఎన్‌సీసీ పదో బెటాలియన్ విద్యార్థులచే గ్రామంలోని చెరువులు, కుంటల పరిశీలన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా చెరువు, కుంటలోని వ్యర్థాలను ఎన్‌సీసీ కేడెట్లతో తొలగించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాంతి మాట్లాడారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అంజిరెడ్డి, ప్రకాశం, పరమేశ్వరి, విజయకుమారి, లలితకుమారి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నీటి సంరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత

దేవరుప్పుల: నీటి సంరక్షణ ప్రతీఒక్కరి నైతిక బాధ్యతగా తీసుకోవాలని బ్రదర్ జేసురాజు పిలుపునిచ్చారు. మంగళవారం నదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారిపై బాలయేసు హైస్కూల్ ఎన్‌సీసీ కేడెట్ల ఆధ్వర్యంలో ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ కోఆర్డినేటర్ కృష్ణ, ఉపాధ్యాయులు ఖాజా, మదన్‌మోహన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవలు అభినందనీయం



జనగామ రూరల్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నర్సయ్య

జనగామ రూరల్: సమాజాభివృద్ధికి ఎన్ఎస్ఎస్ చేస్తున్న సేవలు అభినందనీయమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సయ్య అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకంలో విద్యార్థులు చేరి సేవ చేస్తున్నారని అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసరుకల ఏ శ్రీనివాస్, నవీనారాణి, శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత సామాజిక సేవలో పాల్గొనాలి

జఫర్‌గఢ్: యువత, విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఎన్ఎస్ఎస్ సేవా సంస్థ అధికారి బి.రాజు కోరారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పోల్‌రాజు అధ్యక్షతన జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే యువకులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వర్గీకరణ కమిటీని రద్దు చేయాలి



నియామకపత్రం అందజేస్తున్న రాంమూర్తి

చిల్పూరు: ఎస్సీ వర్గీకరణపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కమిటీని వెంటనే రద్దు చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రాంమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మాలమహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం, నూతన కమిటీ నియామకాన్ని జాతీయ ప్రధాన కార్యదర్శి పసుల యాదగిరి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ వర్గీకరణపై వేసిన కమిటీని రద్దు చేయకుంటే అక్టోబరు 12న హైదరాబాదులో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామన్నారు. సీఎం అందరి సూచనలు తీసుకున్నాక నిర్ణయం తీసుకుంటే బాగుండేదన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా బోగం రాజేందర్, ఉపాధ్యక్షుడిగా తమ్మలి రాజు, చిల్పూరు మండల అధ్యక్షుడిగా ఎడ్ల నర్సయ్యను ఏకగ్రీవంగా ప్రకటించి నియామక పత్రాలను అందజేశారు. సమావేశంలో ఉసిళ్ల కుమార్, పసుల రమేష్, కరుణాకర్, కారు శ్రీపాల్, పీక సదయ్య, ఎడ్ల రాజు, కుమారస్వామి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పాలకుర్తి టౌన్: చెత్తను తొలగిస్తున్న నాయకులు



బచ్చన్నపేట: ఇంకుడు గుంతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకుర్తి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆస్పత్రిలో చెత్తను తొలగించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దుంపల సంపత్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బా రాజశేఖర్‌గౌడ్, చౌడ రమేష్, సుంకరనేని కోటేశ్వర్, మూడెపల్లి సోమన్న, చింత సృజన్,కదుదుల నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి

బచ్చన్నపేట: ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో శ్రమదానం, విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: రైతుల రుణమాఫీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబరాజు యాదగిరి, మండల కార్యదర్శి బోడ నరేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని వడ్లకొండ గ్రామంలో గ్రామ శాఖ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రేషన్‌కార్డుతో ముడిపడి ఉన్నందున అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. షరతులు లేకుండా రైతులకు రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శులుగా కాస జగన్, మదోజు రామసోక్కంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపేందర్, సికిందర్, సత్తయ్య, సిద్దయ్య, యాదగిరి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

తరిగొప్పుల: మండలకేంద్రానికి చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శి చింతల కృష్ణ ఇటీవల పాముకాటుతో మృతిచెందగా ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు డీపీఎం నాగపూరి స్వరూప రాణి హాజరై బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. రాష్ట్ర వాప్యంగా పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల, మృతుడి స్నేహితులు విరాళంగా అందించిన నగదు రూ.2.30 లక్షలు కాగా, మృతుడి కూతురు పేరున రూ.1.50 లక్షల సుకన్య సమృద్ధి యోజన పథకం, కుమారుడి పేరున రూ.80 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో పొదుపు చేశారు. వీటికి సంబంధించిన పత్రాలను డీపీఓ మృతుడి భార్య లావణ్యకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ మాలతి, నర్మెట ఎంపీడీఓ అరవింద్ చౌదరి, టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కనకం విజయ్‌కుమార్, సంతోష్‌కుమార్, మహేందర్, భూక్య లింగం, భూక్య రాజేందర్, భాగ్యలక్ష్మి, దామెర వంశీ, రవీందర్ పాల్గొన్నారు.



తరిగొప్పుల: పత్రాలు అందజేస్తున్న డీపీఓ స్వరూప రాణి

ఆర్థికసాయం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన అలుగోజు లక్ష్మి అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, బాధిత కుటుంబాన్ని రాష్ట్ర రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, కాంగ్రెస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.12,600 సాయం అందజేశారు. దుంపల పద్మారెడ్డి, మంతెన ఇంద్రారెడ్డి, లింగారెడ్డి, గాదె చంద్రయ్య, చుక్క రమేష్, మార్క రాజు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సాయం

లక్ష్మి మృతిచెందిన విషయం తెలుసుకున్న వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ చల్లా చందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్‌గౌడ్ గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.5వేల సాయం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు కంసాని రాజిరెడ్డి, ధర్మారెడ్డి, అనీల్‌రెడ్డి, గాదె పురుషోత్తం, వెంకటేష్, రంజిత్, వెంకటేష్, రమేశ్ పాల్గొన్నారు.

చేయూత



జనగామ రూరల్: విజయవాడ వరదబాధితుల సహాయార్థం పట్టణంలోని నెహ్రూపార్క్ సెయింట్ మేరీస్ పాఠశాల ప్రిన్సిపాల్ బసాని శ్రీధర్‌రెడ్డి ప్రోత్సాహంతో విద్యార్థులు ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ మేరకు సేకరించిన రూ.25వేలను ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి విద్యార్థులతో కలిసి మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు అందజేశారు.

వైద్యశిబిరం



నర్మెట: గండిరామారంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్ అరుణ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా హెల్త్ క్యాంపును హ్యాండ్ ఆఫ్ హోప్ వారు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్త, కంటి పరీక్షలు, పంటి, గుండె, కాలేయ, కీళ్ల, కాలానుగుణ వచ్చే వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించిన వైద్యులు మందులు, కంటి అద్దాలు అందజేశారు. డాక్టర్ రాజు, సంస్థ ఇంచార్జ్ జయరాజ్, మాజీ సర్పంచ్ జాల స్వేతా కిషన్, ఎమ్మార్పీస్, ఎంఎస్పీ, చుంచు రాజు, రాగళ్ళ ఉపేందర్, పైసా రాజశేఖర్, సాగర్, చెవుల పరశురాములు, గద్దల ప్రభాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి సభ్యత్వాలు చేయండి

నర్మెట: లక్ష్యానికి మించి సభ్యత్వ నమోదులు చేయించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి, అసెంబ్లీ సభ్యత్వ నమోదు కన్వీనర్ ధరావత్ రాజు అన్నారు. మండల పార్టీ శాఖ అధ్యక్షుడు రంగు మురళి ఆధ్వర్యంలో మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ బొల్లం అవినాష్, బైరగోని ఆంజనేయులు, రాజు, నారాయణ రెడ్డి, పులి కపిల్, బైరోజు బ్రహ్మచారి, శంకర్, పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా వల్మిడి

పాలకుర్తి టౌన్: మండలంలోని వల్మిడి సీతారామ చంద్రస్వామి ఆలయం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందడం అభినందనీయమని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. వల్మిడి ఆలయాన్ని మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వల్మిడి ఆలయ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉన్నాయని అన్నారు.

ఘన్‌పూర్–తాటికొండ బస్సు సర్వీసు పునఃప్రారంభించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి మండలంలోని తాటికొండ గ్రామానికి గతంలో ఉన్నటువంటి ఆర్టీసీ బస్సు సర్వీసును పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ యూనుస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఘన్‌పూర్ బస్టాండ్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కంట్రోలర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ

నర్మెట: నర్మెట సీఐగా ముసుకు అబ్బయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సీఐగా పనిచేసిన మినుకూరి సాయిరమణ దుగ్గొండికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో వరంగల్ సీసీఎస్‌లో విధులు నిర్వహించిన అబ్బయ్య బదిలీపై నర్మెటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.

నియామకం

చిల్పూరు: సామాజిక న్యాయ వేదిక జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మండలంలోని ఫత్తేపూర్ గ్రామానికి చెందిన బానోత్ బాలరాజును నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు యశబోయిన సాంబయ్య యాదవ్ మంగళవారం ప్రకటించారు. తాను చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి తనకు పదవి వచ్చేలా కృషిచేసిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాదం గట్టయ్య యాదవ్, నారగోని పరమేష్‌లకు బాలరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నివాళి

జనగామ రూరల్: సీపీఐ నేత తొర్ర సత్యం వర్ధంతిని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, మంగళంపల్లి జనార్దన్, సోమయ్య, సదనమ్మ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

లింగాలఘణపురం: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ఏసీడీపీఓ సత్యవతి అన్నారు. మంగళవారం మండలంలోని బండ్లగూడెం రైతు వేదికలో మండల స్థాయి పోషణ మాసం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, డాక్టర్ రవితేజ, డాక్టర్ హారిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హంసమ్మ, పుష్ప, హెల్త్‌సూపర్ వైజర్లు సుజాత, భాగ్య పాల్గొన్నారు.

'సహారా ఇండియా' డబ్బులు ఇప్పించండి



మాట్లాడుతున్న నాయకులు

జనగామ: సహారా ఇండియా పొదుపు చేసుకున్న డబ్బులను పాలక ప్రభుత్వాలు స్పందించి బాధితులకు వెంటనే ఇప్పించాలని బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పూజిత, రాష్ట్ర కార్యదర్శి వి.బాలయ్య, రాష్ట్ర కోశాధికారి నారాయణ, సఫియా అమీనా అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. భవిష్యత్ అవసరాల కోసం సహారా కంపెనీలో డిపాజిట్ చేసుకుంటే, గడువు ముగిసి ఏళ్లు గడిచిపోతున్నా రూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. పేద ప్రజలకు రావాల్సిన లక్షల కోట్ల ధనం ఇవ్వకుండా, కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ప్రజల పక్షాన ఉండాల్సింది పోయి, ప్రభుత్వాల పంచన చేరి మోసం చేస్తున్నాయని అన్నారు. పొదుపు చేసుకున్న కుటుంబాల్లో ఎక్కువగా రోజువారి కూలా చేసుకునే వారు ఉన్నారని, రెక్కల కష్టం వస్తుందో రాదో తెలియని పరిస్థితుల్లో ఆందోళన చెందుతున్నారన్నారు. ఒక్క జనగామ బ్రాంచ్‌లోనే రూ.13కోట్ల మేర రావాల్సి ఉందని తెలిపారు. డబ్బులు రాబట్టుకునేందుకు భవిష్యత్ ఉద్యమాల కోసం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుగా విజయ, ఉపాధ్యక్షులుగా రమ, ఉమ, ప్రధాన కార్యదర్శిగా అమీనా, సహాయ కార్యదర్శిగా లావణ్య, కోశాధికారిగా సఫి యా, సభ్యులుగా చందు, కిష్టయ్య, నరసింహా రావు, నక్క బాపు, ఉపేంద్ర, లలితలను ఎన్నుకున్నారు.

నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా..



పేషెంట్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఎవరూ అధైర్యపడొద్దని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. నీలిమ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నియోజకవర్గ ప్రజలను మంగళవారం ఆప్యాయంగా పలకరించి ఆరోగ్యం పరిస్థితులను తెలుసుకున్నారు. డాక్టర్లతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు.

బొట్ల శ్రీనివాస్ కుటుంబానికి..

సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ బొట్ల చిన్న శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందగా, మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపెల్లి ప్రేమలతరెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ సిద్ధిలింగం, కౌన్సిలర్లు, నాయకులు ముస్త్యాల ద యాకర్, గుర్రం నాగరాజు, కో ఆప్షన్ మసిఉర్ రెహమాన్ తదితరులు ఉన్నారు.

శనిగచెరువు శిఖం, బఫర్ జోన్ హద్దుల గుర్తింపు

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని శనిగచెరువు, పారకం కాల్వలు ఆక్రమణకు గురయ్యాయని ఇటీవల స్థానికుడు శాడ శ్రీనివాస్ ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఇరిగేషన్, రెవెన్యూ, భూమి కొలతలు, రికార్డుల కార్యాలయం సహాయ సంచాలకులు సర్వే చేపట్టారు. చెరువు విస్తీర్ణం 126–26 ఎకరాలు ఉండగా అందులో ట్యాంక్ బఫర్ జోన్, శిఖం భూముల హద్దులను గుర్తించి మార్కు చేశారు. గతంలో జరిగిన మిషన్ కాకతీయ పనులపై ఇరిగేషన్ అధికారులు ఆరా తీశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చెరువు ఆక్రమణ పై ఫిర్యాదు మేరకు హద్దులు గుర్తించామని, పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు. జిల్లా ఏడీ మన్యపు కొండల్, ఇరిగేషన్ ఏఈ గీత, మండల సర్వేయర్ మహేందర్, డిప్యూటి ఇన్‌స్పెక్టర్ నూక రాజు, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయండి

జఫర్‌గఢ్: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వై.రాధాకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ పనులపై మాజీ ఎంపీపీ రడపాక సుదర్శన్, మాజీ ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులతో కలసి ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాల సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం నూతనంగా మండల పత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రాధకృష్ణను అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ సుమన్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పోష్టికాహారం ఆవశ్యకతను చాటుదాం

దేవరుప్పుల: ఇంటింటా పోష్టికాహారం ఆవశ్యకతను చాటుదామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి సూచించారు. మంగళవారం మండలంలోని సింగరాజుపల్లిలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా కౌమారదశ బాలికల పరిరక్షణ, పోష్టికాహారం ప్రయోజనాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు.

'ఎఫ్ఏలతో చెత్త పనులు'

స్టేషన్‌ఘన్‌పూర్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో చెత్త, వ్యర్థాలు ఎత్తిపోయించడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలోని ఈజీఎస్ ఆఫీస్‌కు వచ్చారు. అక్కడ ఏళ్ల తరబడి ఉన్న చెత్త, వ్యర్థాలను శుభ్రం చేయాలని ఏపీఓ పురమాయించారు. దీంతో ఇష్టం లేకపోయిన పైఅధికారి కావడంతో కార్యాలయంలోని రికార్డులు సర్దుతూ చెత్త, వ్యర్థాలను ఎత్తి బయట పడేశారు. అయితే ఎవరైన కూలీలను పెట్టి శుభ్రం చేయించాల్సి ఉండగా మాతో చేయించడం దారుణమని, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఎఫ్ఏలు కోరుతున్నారు. ఈ విషయమై ఏపీఓ ప్రేమయ్య మాట్లాడుతూ ఎఫ్ఏలతో కలిసి నేను కూడా పని చేశా. 'ఈజీఎస్ పనులకు సంబంధించిన ముఖ్యమైన రికార్డులు ఉంటా యి. అందుకే బయట కూలీలకు చెప్పకుండా మా పని మేమే చేసుకున్నాం' అని వివరణ ఇచ్చారు.

జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

పాలకుర్తి టౌన్: నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఐలమ్మ స్మారక భవనంలో నిర్వహించిన సీపీఎం మహాసభలో ఆయన మాట్లాడారు. నాయకులు సోమన్న, సారయ్య, మంజుల, రాణి పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడాకారుల ఎంపిక

చిల్పూరు: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 26, 27 తేదీల్లో చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ నోడల్ అధికారి దాసరి గోవర్ధన్, హెచ్‌ఎం గుడిమళ్ల సంపత్‌లు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో 26న బాలురు, 27న బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు మండల కన్వీనర్ పీడీ చుక్కమ్మ 62813 29554, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవీందర్‌ప్రసాద్ 80081 09566 లను సంప్రదించాలని సూచించారు.

అభాగ్యులకు అండగా ఉంటాం

దేవరుప్పుల: నియోజకవర్గంలో అభాగ్యులకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మృతి చెందిన బుర్ర ప్రమీల, అప్పిడి సోమిరెడ్డి, సీతారాంపురంలో చీమల బీరయ్య, దేవునిగుట్టలో బాస్త్ రాములు, కడవెండిలో ఇల్లందుల ఎల్లయ్య చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

'జీఓ 25 నిబంధనలను మార్చాలి'

పాలకుర్తి టౌన్: అశాస్త్రీయ పద్ధతిలో ఉన్న రేషనలైజేషన్ జీఓ 25 నిబంధనలు మార్చాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తరగతికి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించవలసి ఉండగా అశాస్త్రీయమైన జీఓ 25 అమలు చేయాలని పాఠశాల విద్యాసంచాలకులు జిల్లా కలెక్టర్ ఆదేశించిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దు

కొడకండ్ల: సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, తప్పుడు పోస్టులు వీడియోలు పెట్టడం, షేర్ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై చింత రాజు హెచ్చరించారు. మంగళవారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, పోస్టులపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుందన్నారు.కాగా, నర్సింగాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎస్సైని కలిసి సన్మానించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయండి

బచ్చన్నపేట: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి మురళీకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న తలపెట్టిన విద్యార్థి మహా గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సాగర్, దీన, చిన్మయి, నివేదిక, నిఖిల్, సూర్య, ఆనంద్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

పాలకుర్తి టౌన్: మండల కేంద్రానికి చెందిన కమ్మగాని సోమయ్యగౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మంగళవారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులను అందజేశారు. జీడి హరీష్, సభ్యులు వర్రె కుమారస్వామి ఉన్నారు.

పరామర్శ

దేవరుప్పుల: తెలంగాణ సాధన కోసం ఆవిర్భవించిన బీఆర్ఎస్‌ను ఎవరూ కనుమరుగు చేయలేరని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి జనగామ జైలు నుంచి విడుదలైన బీఆర్ఎస్ నాయకులు గొడుగు మల్లికార్జున్, వంగ అర్జున్‌ను పార్టీ మండల నాయకులు పరామర్శించారు.